క్లుప్తంగా

ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో వృత్తి విద్య కోర్సులైన ఫొటో, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండీషనింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ ప్రతినిధి ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 1వ తేదీ నుంచి 30 రోజులపాటు అందించే శిక్షణకు 18–45 సంవత్సరాల మధ్య వయస్సు కలిగిన నిరుద్యోగ యువకులు అర్హులన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, సౌకర్యం కల్పిస్తామన్నారు. అర్హులైన వారు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

బయోటెక్నాలజీలో డాక్టరేట్


సమీన

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం బయోటెక్నాలజీ శాఖ పరిశోధకురాలు షేక్ సమీనకు వైవీయూ డాక్టరేట్ ప్రదానం చేసింది. బయోటెక్నాలజీ ప్రొఫెసర్ ఎ. చంద్రశేఖర్ పర్యవేక్షణలో 'నెక్స్ట్ జనరేషన్ సీక్వెన్సింగ్ పద్ధతిని ఉపయోగించి, కొర్రల దిగుబడిని పెంచేందుకు రికాంబినెంట్ ఇన్‌బ్రీడ్ లైన్స్'ని అభివృద్ధి చేశారు. ఈమె చేసిన పరిశోధనకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వైవీయూ పరీక్షల నిర్వహణాధికారి ప్రొఫెసర్ ఈశ్వర్ రెడ్డి తెలిపారు.

వైవీయూ ఆర్ట్స్ విభాగ డీన్‌గా కంకణాల గంగయ్య


ఆచార్య కె. గంగయ్యకు నియామక పత్రాన్ని అందజేస్తున్న వీసీ, రిజిస్ట్రార్ తదితరులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయ ఆర్ట్స్ విభాగం డీన్‌గా చరిత్ర, పురావస్తు శాఖ ఆచార్యులు డాక్టర్ కంకణాల గంగయ్య నియమితులయ్యారు. నియామకపు పత్రాన్ని వైవీయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డితో కలసి తన ఛాంబర్‌లో అందజేశారు. ఇప్పటి వరకు డీన్‌గా పని చేసిన తెలుగు శాఖ ఆచార్యులు తప్పెట రామ ప్రసాదరెడ్డి పదవీకాలం పూర్తి కావడంతో నూతన నియామకం చేపట్టారు.

హెల్మెట్ ధరించండి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ద్విచక్ర వాహనదారులతోపాటు అందులో ప్రయాణించే వారు హెల్మెట్‌ధరించి సురక్షితంగా గమ్య స్థానానికి చేరుకోవాలని దిశ పోలీసుస్టేషన్ డీఎస్పీ రమాకాంత్ పిలుపునిచ్చారు. రాయల్ రషీద్ అసోసియేషన్ ఆధ్వర్యంలో దిశ పోలీసుస్టేషన్ వద్ద ప్రజలకు హెల్మెట్ ధారణపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించి కరపత్రాలను పంపిణీ చేశారు.

కడప ఎడ్యుకేషన్: జడ్జి ఎస్ బాబా ఫక్రుద్దీన్ గురువారం రాయల్ రషీద్ అసోసియేషన్ వారు తయారు చేసిన హెల్మెట్ ధరించండి అనే ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు.

సరుకులు పంపిణీ


నిత్యావసర సరుకులు, నగదును అందజేస్తున్న దాతలు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అనారోగ్య కారణాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న వృద్ధులైన బొమ్మిశెట్టి వీరులు కుటుంబానికి స్నేహం ఫౌండేషన్ ప్రతినిధి ప్రసన్నతోపాటు దాతలు తోడ్పాటు అందించారు. కడప నగరానికి చెందిన వెంకట సుబ్బమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఆమె కుమారుడు వెంకటేశు, మనవడు, మనవరాళ్లు రాఘవేంద్ర, కృష్ణవేణిలు 7,000 రూపాయలు విలువగల నిత్యావసర సరుకులు అందజేశారు. ప్రసన్న తన మిత్రబృందంతో కలిపి రూ. 5 వేలు నగదు అందచేసి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, విష్ణు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

నగరంలో ర్యాలీ



కాగడాలతో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కార్గిల్ యుద్ధంలో మృతి చెందిన వీరులకు నివాళులర్పిస్తూ బీజేవైఎం బొమ్మన విజయ్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. స్థానిక అంబేడ్కర్ సర్కిల్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ కోటిరెడ్డిసర్కిల్ వరకు కొనసాగింది. బీజేపీ జిల్లా నేతలు వంగల శశిభూషణ్‌రెడ్డి, సింగారెడ్డి రామచంద్రారెడ్డి, బీరం సుబ్బారెడ్డి, బాల కృష్ణ యాదవ్, సురేంద్ర, జంగిటి వెంకట సుబ్బారెడ్డి, ఓబులేశు, బత్తల పవన్‌కుమార్, శోభా భాయి, పద్మాభాయి పాల్గొన్నారు.

తల్లికి వందనం ఎప్పుడు ఇస్తారు

కడప ఎడ్యుకేషన్: తల్లికి వందనం ఎప్పుడు అమలు చేస్తోందో రాష్ట్ర ప్రభుత్వం చెప్పాలని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున అన్నారు. గురువారం కడప నగరంలోని కార్యాలయంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం ప్రతి విద్యార్థికి తల్లికి వందనం వెంటనే అమలు చేయాలని కోరారు.


పాతబస్టాండులో అపరిశుభ్రం


బస్సులు ఎక్కే ప్రాంతంలో ఇలా..


బస్టాండులో పైకప్పు పెచ్చులూడిన దృశ్యం

చెట్టంత నిర్లక్ష్యం


నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే కడప నగరంలోని పాత బస్టాండు

- కడప పాత బస్టాండ్‌లో పొంచి ఉన్న ప్రమాదం
- పట్టించుకోని అధికార యంత్రాంగం
- సమస్యలు పరిష్కరించాలంటున్న ప్రజానీకం



కడప కోటిరెడ్డిసర్కిల్ : జిల్లా కేంద్రమైన కడప పాత బస్టాండు ప్రతినిత్యం ప్రయాణీకులతో రద్దీగా ఉంటోంది. ప్రజలు తమ గమ్యస్థానాలకు వెళ్లేందుకు ప్రతిరోజు వేలాది సంఖ్యలో పాత బస్టాండుకు వస్తుంటారు. అలాగే ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారు ఆయా ప్రాంతాలకు వెళ్లేందుకు దగ్గర కావడంతో పాత బస్టాండులో బస్సు దిగి ఆయా ప్రాంతాలకు వెళుతుంటారు. ప్రయాణీకులకు సేవలు అందించాల్సిన పాత బస్టాండులో సరైన సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

సమస్యలతో సతమతం

జిల్లా పరిధిలోని ప్రధాన పట్టణాలతోపాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే సర్వీసులు కడప పాత బస్టాండు నుంచి బయలుదేరుతాయి. ముఖ్యంగా తమ గమ్య స్థానాలకు వెళ్లే బస్సులు వచ్చేవరకు కూర్చొనేందుకు కుర్చీలు లేకపోవడంతో నానా అగచాట్లు పడాల్సి వస్తోంది. కూర్చొనేందుకు బస్టాండు పిల్లర్ల అరుగులను ఆశ్రయించాల్సి వస్తోంది. మరో వైపు దుకాణాల వద్ద నిలబడితే తమ వ్యాపారానికి అడ్డమంటూ పలువురు వ్యాపారులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

– ఇక బస్టాండు భవనం నిర్మించి చాలాకాలమైనందున తరుచూ బస్టాండు శ్లాబు పెచ్చులు ఊడిపడుతున్నాయి. గతంలో శ్లాబు పెచ్చులూడి ప్రయాణీకులు గాయపడిన సంఘటనలు కూడా లేకపోలేదు. అదేవిధంగా బస్టాండు ఫ్లోరింగ్ బండలు పగిలి ఎగుడు దిగుడుగా ఉండడంతో వృద్ధులు, చిన్నారులు బస్సు ఎక్కేందుకు వెళ్లి కిందపడిన ఘటనలు ఉన్నాయి.

బస్టాండు ఆవరణం అపరిశుభ్రత

పాత బస్టాండులో తీవ్ర అపరిశుభ్రత నెలకొంది. బస్టాండును శుభ్రపరిచే వారు లేకపోవంతో దుకాణదారులు తమ దుకాణాల వద్ద శుభ్రం చేసుకుని చెత్తాచెదారాన్ని బస్టాండులో వదిలి వేస్తున్నారు. ఇక బస్టాండు ఆవరణలో బహిరంగ ప్రదేశంలో మూత్ర విసర్జన చేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది.

– మహిళలు అత్యవసరమై మూత్రశాలలకు వెళ్లాల్సి వస్తే ఇబ్బందులు తప్పడం లేదు.

రాత్రిళ్లు బయటి నుంచే బస్సుల రాకపోకలు

ఇంతటి ప్రాధాన్యతగల పాత బస్టాండులో మరో పెద్ద సమస్య ప్రయాణీకులను తీవ్రంగా వేధిస్తోంది. రాత్రి సమయాల్లో బస్సులు బస్టాండులోకి రాకపోవడంతో ప్రజల కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయి. హైదరాబాదు, విజయవాడ, చెన్నై, బెంగుళూరు తదితర సుదూర ప్రాంతాలకు వెళ్లే బస్సులు అధిక సంఖ్యలో రాత్రి సమయంలో బయలుదేరుతాయి. అలాంటి తరుణంలో ప్రయాణీకులు పాత బస్టాండుకు బదులు ఆర్టీసీ బస్టాండుకు వెళ్లాల్సి వస్తోంది. ఇదిలా ఉండగా రాత్రిళ్లు పాత బస్టాండు అంధకారంలో ఉండడంతో పశువుల సంచారం కొనసాగుతోంది.



దుర్వాసనతో ఇబ్బందులు

పాత బస్టాండులో అపరిశుభ్రతకు తోడు వర్షం వస్తే పరిసరాల్లో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. బస్టాండు మొత్తం అపరిశుభ్రంగా ఉండడంతో దోమల వల్ల ప్రయాణీకులు ఉండలేకపోతున్నారు. అలాగే తాగేందుకు మంచినీరు సైతం అందుబాటులో లేకపోవడంతో అధిక ధర పెట్టి మినరల్ బాటిళ్లు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీనికితోడు బస్టాండు ఆవరణలో ప్రజలు ఇష్టానుసారంగా మూత్ర విసర్జన చేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోంది.

– కాశీ విశ్వనాథ్, కడప

కనీసం కుర్చీలు కూడా లేవు

నగర నడిబొడ్డునగల పాత బస్టాండుకు వచ్చే ప్రయాణీకుల కష్టాలు వర్ణణాతీతంగా ఉన్నాయి. బస్టాండులో కూర్చొనేందుకు కనీసం కుర్చీలు లేకపోగా, అపరిశుభ్ర వాతావరణం తీవ్ర అసహనానికి గురిచేస్తోంది. బస్టాండు ఆవరణం దుర్వాసన వెదజల్లుతుండడంతోపాటు ఇతర సమస్యలు ప్రయాణీకులను వేధిస్తున్నాయి. ప్రయాణీకుల సదుపాయాలపై ఆర్టీసీ అధికారులు తగిన చర్యలు చేపట్టాలి.

– ఈశ్వరయ్య, కడప



కలెక్టర్‌ను కలిసిన పౌరసంబంధాలశాఖ అధికారి

కడప సెవెన్‌రోడ్స్ : ఇటీవల జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన శివశంకర్ లోతేటిని పౌరసంబంధాలశాఖ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు మహబూబ్‌బాష మర్యాద పూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిసి పూల మొక్కను అందజేసి శాఖాపరమైన అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన వైస్ చాన్సలర్లు

వైవీయూ/ఏఎఫ్‌యూ: కడప కలెక్టర్ శివశంకర్ లోతేటిని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం నూతన వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం, పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన విశ్వవిద్యాలయం అందిస్తున్న కోర్సులను, ప్రగతిని కలెక్టర్‌కు వివరించారు. అనంతరం యోగివేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డితో కలిసి విశ్వవిద్యాలయాల ప్రగతిపై జిల్లా కలెక్టర్‌తో చర్చించారు.

హ్యాండ్‌బాల్ కోర్టుకు చోటు కల్పించండి

కడప స్పోర్ట్స్: జిల్లా క్రీడాప్రాధికార సంస్థ మైదానంలో హ్యాండ్‌బాల్ క్రీడకు చోటు కల్పించాలని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లయన్ కె. చిన్నపరెడ్డి కోరారు. గురువారం కలెక్టర్ లోతేటి శివశంకర్, జేసీ అతిథిసింగ్‌లను వేర్వేరుగా కలిసి హ్యాండ్‌బాల్ క్రీడకు సంబంధించిన స్థలకేటాయింపు విషయమై విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా నగరంలో హ్యాండ్‌బాల్ శిక్షణ సాగుతోందని, గతంలో హ్యాండ్‌బాల్ అకాడమీ సైతం ఇదే మైదానంలో నిర్వహించారన్నారు. ఇలాంటి తరుణంలో హాకీ కోర్టు నిర్మాణం పేరుతో హ్యాండ్‌బాల్ క్రీడకు మైదానంలో చోటు లేకుండా చేశారని విన్నవించారు. దీనికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ పరిశీలించి తగు నిర్ణయం తీసుకుంటామన్నారు.

విద్యార్థులు లక్ష్య సాధనకు కృషి చేయాలి


మాట్లాడుతున్న చొప్పా గంగిరెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని అధిగమించేందుకు కష్టపడి చదవాలని అన్నమాచార్య విద్యా సంస్థల అధినేత చొప్పా గంగిరెడ్డి తెలిపారు. గురువారం కడప నగర శివార్లలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో ఇంజనీరింగ్ మొదటి సంవత్సర విద్యార్థులకు ఓరియంటేషన్ సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నేటి విద్యార్థులకు ఉన్నత విద్యను అందించి వారిని ఉన్నత స్థానాల్లో నిలిపేందుకు తాము విద్యాసంస్థలను ఏర్పాటు చేశామన్నారు. ఇంజనీరింగ్ కోర్సులకు ఉన్న పుష్కలమైన అవకాశాలు మరే ఇతర కోర్సులకు లేవన్నారు. వైస్ చైర్మన్ చొప్పా యల్లారెడ్డి మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో ఇంజనీర్ల పాత్ర కీలకమని, ఎంత కష్టపడి చదివితే అంత ఫలితం ఉంటుందన్నారు. ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ క్రమ శిక్షణ, విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందిస్తున్నామన్నారు. విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అన్ని విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అప్రమత్తతే బాలికలకు రక్షణ


మాట్లాడుతున్న ఎన్ఎస్ఎస్ పీఓ లలిత

వైవీయూ: విద్యార్థినిలు వ్యక్తిగత విషయాల పట్ల గోప్యతను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని వైవీయూ పీజీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య పుత్తా పద్మ అన్నారు. జాతీయసేవా పథకం యూనిట్–7, 4 ప్రోగ్రాం ఆఫీసర్లు డా. ఎస్. లలిత, సునీత, మైనార్టీ సెల్ డైరక్టర్ డైరెక్టర్, రియాజున్నీసా ఆధ్వర్యంలో 'మహిళా రక్షణ చైతన్య సదస్సు' విశ్వవిద్యాలయంలోని సెమినార్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆచార్య పద్మా మాట్లాడుతూ క్యాంపస్‌లో, ఇక్కడ సమస్య వచ్చిన వెంటనే ఉమెన్ సెల్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విశిష్ట అతిథి, సఖి వన్ స్టాప్ సెంటర్ కౌన్సిలర్ కే. సునీత మాట్లాడుతూ సమస్య వచ్చినప్పుడు హెల్ప్ లైన్ నెంబర్ (1811120098) ను సంప్రదించాలన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త వెంకట్రామిరెడ్డి , డాక్టర్ లలిత, డాక్టర్ సునీత మాట్లాడుతూ విలువలతో చదువులు సాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రతినిధి డాక్టర్ రాజగోపాల్ రెడ్డి, డాక్టర్ అశ్వర్థ రెడ్డి, విద్యార్థినిలు పాల్గొన్నారు.

4 నుంచి 18 వరకు కడప బాలోత్సవం


బాలోత్సవ కార్యక్రమ వివరాలు తెలుపుతున్న వీర సుదర్శన్‌రెడ్డి

కడప కల్చరల్ : కడప బాలోత్సవం ఆధ్వర్యంలో ఆగస్టు 4 నుంచి 18వ తేదీ వరకు స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పక్షోత్సవాలను నిర్వహిస్తున్నామని సంస్థ గౌరవ సలహాదారు వీర సుదర్శన్‌రెడ్డి తెలిపారు. కడప నగరంలోని ఎస్వీ ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంచేందుకు నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో సేవా దృక్పథం గల వారంతా పనిచేసేందుకు అవకాశం ఉందన్నారు. కడప బాలోత్సవ్ అధ్యక్షులు గోపాల్, ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దిన పక్షోత్సవాలను పురస్కరించుకుని చిత్రలేఖనం, వ్యాసరచన, స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణ పోటీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 4న ఉదయం 10 గంటలకు డ్రాయింగ్ పోటీలు, మధ్యాహ్నం 1.30 గంటలకు వ్యాసరచన పోటీలు ఉంటాయన్నారు. 18న బహుమతి ప్రదానోత్సవం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కోశాధికారి సునీత, ఉపాధ్యక్షులు బాల యల్లారెడ్డి, సుందరయ్య, వెంకటేశ్వర్లు, కార్యదర్శులు వెంకట సుబ్బయ్య, శ్రీనివాసులు, చిన్న రాయుడు, అరుణ, మధుసూదన్ పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా రాళ్లు వేశారని స్థానికుల ఆవేదన

కడప అర్బన్: కడప నగరంలోని ఆర్టీసి బస్టాండ్ నుంచి రైల్వే స్టేషన్‌కు వెళ్లే దారిలోని లక్ష్మీ టవర్స్ ప్రక్కనున్న రోడ్డు స్థలం తనదంటూ ఓ వ్యక్తి రోడ్డుకు అడ్డంగా రాత్రికి రాత్రే రాళ్లు వేశాడు. ఆ దారిలో వెళ్లే స్థానికులు ఇటువైపు రోడ్డు లేకుండా చేయడం ఏమిటనీ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే హెచ్చరికతో కూడిన ప్లెక్సీని రోడ్డుకు అడ్డంగా ఇరువైపులా కట్టారు.

సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలనీ స్థానికులు విజ్ఞప్తి చేశారు.


రోడ్డుకు అడ్డంగా రాళ్లు వేసి, ఫ్లెక్సీ కట్టిన దృశ్యం

ఆవిష్కరణ



డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత భాగస్వాములు కావాలని కలెక్టర్ శివశంకర్ అన్నారు. గ్రేటర్ రాయలసీమ విద్యార్థి యువజన సమాఖ్య రూపొందించిన పోస్టర్‌ను గురువారం ఆయన ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్నారని, చాపకింద నీరులా వ్యాపిస్తున్న డ్రగ్స్‌ను అరికట్టకపోతే యువత భవిష్యత్తు అంధకారమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య నాయకులు డీఎం ఓబులేశు యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిఖ్, నాయకులు సాయి, నవీన్, నాగమల్లేష్, హరి తదితరులు పాల్గొన్నారు. – కడప సెవెన్‌రోడ్స్

అభినందన



రక్తదాన ఆవశ్యకతను యువతులు గుర్తించాలని సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ సరస్వతి తెలిపారు. కడప స్వచ్ఛంద సేవా సంస్థలు, నెహ్రూ యువ కేంద్రం సంయుక్తాధ్వర్యంలో నిర్వహిస్తున్న రక్త వారోత్సవాల్లో భాగంగా జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం కడప నగరం వివేకానంద మహిళా డిగ్రీ కళాశాలలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. యువతులు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేయడాన్ని అభినందిస్తున్నామన్నారు. కళాశాల కరస్పాండెంట్ మనోహర్ రెడ్డి, జేబీవీఎస్ ది ప్రిజర్వర్ సేవా సమితి వ్యవస్థాపకులు అశోక్ పాల్గొన్నారు. – కడప కోటిరెడ్డిసర్కిల్

అవగాహన



హెల్మెట్ ధరించి ప్రతి ద్విచక్ర వాహనదారుడు సురక్షితంగా గమ్యస్థానాన్ని చేరుకోవాలని జిల్లా న్యాయసేవాధికారసంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. గురువారం ద్విచక్ర వాహనాలు, పిలియన్ డ్రైవర్ల వినియోగారులు హెల్మెట్ ఉపయోగించడంపై అవగాహన కల్పించారు. కె.ఎస్.ఆర్.ఎం ఇంజనీరింగ్ కళాశాల నుంచి పులివెందుల రోడ్ సర్కిల్ వరకు బైక్ ర్యాలీ, బిల్టప్ సర్కిల్ నుంచి రెండవ గాంధీబొమ్మ వరకు రోడ్‌షో/ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె సీఐ శంకర్‌నాయక్, ఏఎస్ఐ, పోలీస్ సిబ్బంది , కళాశాల ప్రొఫెసర్లు, ప్రజలు పాల్గొన్నారు. – కడప అర్బన్

31న వేలంపాట

కడప అర్బన్: కడపలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో వాడుకలో లేని పాత ఫర్నీచర్, చెక్క వస్తువులు, ఇతరత్రాలు ఈనెల 31న మధ్యాహ్నం వేలం వేయనున్నారు. ఈ విషయం కడపలోని జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యాలయం చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ టి.వి.ఎం కృష్ణారావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు.

విద్యా సదస్సు జయప్రదం చేయండి

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈనెల 28న బాలాజీ నగర్‌లోని శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాలలో నిర్వహించబోయే రాష్ట్రస్థాయి విద్యాసదస్సును జయప్రదం చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు కోరారు. గురువారం కడప యూటీఎఫ్ కార్యాలయంలో సదస్సు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తికావస్తున్న సందర్భంగా రాష్ట్రమంతటా స్వర్ణోత్సవాలు జరుగుతున్నాయన్నారు. ఇందులో భాగంగా జిల్లాలలో సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఏజాస్ అహ్మద్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ప్రభాకర్, నాయకులు గోపీనాథ్, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ శిబిరం

కడప స్పోర్ట్స్: కడప నగరంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో వారంరోజులపాటు నిర్వహించిన స్కౌట్ బేసిక్ శిక్షణ శిబిరం గురువారంతో ముగిసింది. శిక్షణ ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్ఐఓ బండి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ విద్యార్థులను సన్మార్గంలో నడిపేందుకు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఎంతో దోహదం చేస్తుందన్నారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కార్యదర్శి డి. ప్రమీల, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ కోశాధికారి బి. శివశంకర్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

హుండీ ఆదాయం లెక్కింపు



కడప కల్చరల్ : కడప నగరం గడ్డిబజారులోని శ్రీ సోమసుందరేశ్వరస్వామి ఆలయం, సమీపంలోని శ్రీ లక్ష్మి సత్యనారాయణస్వామి ఆలయాల హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. కడప గ్రూప్ ఆఫ్ టెంపుల్స్ ఈఓ శ్రీధర్, ఇన్‌స్పెక్టర్ ఎస్.జనార్ధన్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. శ్రీ సోమసుందరేశ్వరస్వామి ఆలయంలో మార్చి 30 నుంచి జులై 25వ తేదీ వరకు నాలుగు నెలలకు గాను రూ. 16,559 లభించిందని అధికారులు తెలిపారు. శ్రీ సత్యనారాయణస్వామి ఆలయంలో హుండీల ద్వారా రూ. 504 లభించిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శివాలయం అర్చకులు శ్రీ చంద్రమౌళిశర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

శివారు ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలి


సీఎంఆర్ పల్లిలో స్థానికులతో మాట్లాడుతున్న అడిషనల్ కమిషనర్ రాకేష్ చంద్రం

కడప కార్పొరేషన్: కడప నగర శివారు ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచేలా శానిటేషన్ సిబ్బంది, అధికారులు చర్యలు తీసుకోవాలని అడిషనల్ కమిషనర్ కె. రాకేష్ చంద్రం ఆదేశించారు. గురువారం ఆయన సీఎంఆర్‌పల్లి దాని చుట్టు పక్కల ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంత ప్రజలతో మాట్లాడి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తక్షణమే అక్కడ చేయవలసిన శానిటేషన్ పనులను చేయవలసినదిగా అధికారులకు ఆదేశించారు. మురికి నీరు సజావుగా వెళ్లేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల నిర్మాణానికి ఇంజనీరింగ్ విభాగ అధికారులు తగిన ప్రణాళికలను సిద్ధం చేసుకోవలసిందిగా సూచించారు.

కడప నగరంలో పోలీసుల స్పెషల్ డ్రైవ్


కడప నగరంలో స్పెషల్ డ్రైవ్‌ను నిర్వహిస్తున్న కడప ఇన్‌ఛార్జ్ ఎన్. సుధాకర్, సీఐలు, ఎస్ఐలు

కడప అర్బన్: కడప నగరంలో బుధవారం రాత్రి నుంచి కడప ఇన్‌ఛార్జ్ డీఎస్పీ ఎన్. సుధాకర్ ఆధ్వర్యంలో కడప వన్‌టౌన్ సీఐ సి. భాస్కర్‌రెడ్డి, టూటౌన్ సీఐ ఇబ్రహీం, కమాండ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు తమ సిబ్బందితో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బ్లూకోల్ట్స్, స్పెషల్ పార్టీ సిబ్బందితో కలిసి ముమ్మరంగా వాహనాలను తనిఖీలు చేపట్టారు. నైట్ పెట్రోలింగ్‌ను వారంరోజుల పాటు నిర్వహించనున్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఎవరైనా మద్యం సేవిస్తే కఠినచర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. నిర్ణీత సమయానికి షాపులను మూసివేయాలని, రోడ్లపై రాత్రిపూట అనవసరంగా తిరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.